క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ స్నేహనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ హనుమకొండ టౌన్ సాంబరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని స్నేహనగర్, ఎన్జీవోస్ కాలనీ, మెయిన్‌రోడ్డు, రాఘవేంద్ర నగర్, క్యాథలిక్ చర్చి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

వరంగల్ క్రైం: నగరంలో డీజే సౌండ్‌లకు ఎలాంటి అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్ధరాత్రి సమయాల్లో పెళ్లి ఊరేగింపు వేళ డీజేలు వినియోగిస్తుండటంతో అధిక శబ్దాలతో హృద్రోగులు, వృద్ధులు, పిల్లలు అనారోగ్యం పాలుతున్నారని పేర్కొన్నారు. అలాగే, పరీక్షల వేళ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సీపీ అంబర్ కిషోర్ ఝా సూచనల మేరకు నగరంలో డీజేల వినియోగంపై ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



వరంగల్: ఏనుమాముల పోలీసు స్టేషన్ పరిధిలోని మహిళలకు ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కు వినియోగంపై ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ అవగాహన కల్పించారు. బాలాజీ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నర్సిహరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోలీసుల కవాతు



కాజీపేట: కాజీపేట పట్టణంలోని పలు కాలనీల్లో సాయుధ పోలీసు బలగాలు ఆదివారం కవాతు నిర్వహించాయి. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పురవీధుల్లో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియా వాడకంపై నియంత్రణ ఉంటుందని ప్రజలు గుర్తించాలని సూచించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందితో దర్గా కాజీపేట, ఫాతిమానగర్, ప్రశాంత్‌నగర్, శౌరినగర్ కాలనీల మీదుగా ర్యాలీ తీశారు. కవాతులో ఎస్సై శివకృష్ణ, లవన్‌కుమార్, నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



కాజీపేట అర్బన్: తెలంగాణ రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారాలను హనుమకొండలోని మాస్టర్‌జీ కళాశాలలో భట్రాజు సంఘం అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్ రాజు ఆధ్వర్యంలో ఆదివారం ప్రదానం చేశారు. కవిత్వం, కళారంగం, విద్య, వైద్యం, సాహిత్యం, క్రీడలు, పారిశ్రామిక, న్యాయ రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారికి పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ హక్కుల దండోరా అధికార ప్రతినిధిగా ప్రసాద్



కేయూ క్యాంపస్: మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు కేతపాక ప్రసాద్‌ను మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ నియమించారు. ఈ మేరకు కేతపాక ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోగులకు పండ్ల పంపిణీ



కాశిబుగ్గ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, జనమైత్రి ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో రోగులకు జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మహమ్మద్ రహీంఖాన్, కార్యదర్శి పవన్‌కుమార్, శ్రీధర్, ఖాజా, జమీల్, వైద్యులు శ్రీలత, అక్షిత, మానస తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అవసరం

- కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి
- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో గోపాల్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో అవసరం అని కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2000 – 2003వ విద్యా సంవత్సరంలో డిగ్రీ బీఎస్సీ (ఎంపీసీ) పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. వారంతా ఒకచోటచేరి నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ముఖ్యఅతిథిగా గోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ యూనివర్సిటీలకు ప్రభుత్వం సరిపడా గ్రాంట్స్ ఇవ్వడం లేదని, అందువల్ల పూర్వ విద్యార్థి సంఘాల సహకారం అవసరం అని గుర్తుచేశారు. కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) జనరల్ సెక్రటరీ, కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ మాట్లాడుతూ ఎక్కువమంది పూర్వ విద్యార్థులు అధ్యాపక వృత్తిలో ఉన్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్య ద్వారానే సామాజిక అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, కెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ సవితాజ్యోత్స్న, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, రిటైర్డ్ ప్రొఫెసర్లు భాస్కర్‌రావు, సుమతి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ పాఠశాలలో..



సమ్మేళనంలో మహాత్మాగాంధీ విద్యార్థులు

హసన్‌పర్తి: మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ పాఠశాల పూర్వ విద్యార్థుల (2001 –2002 ఎస్సెస్సీ బ్యాచ్) సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా ఒకచోట చేరి గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఇకనుంచి ప్రతిఏటా సమ్మేళనం నిర్వహించుకోవాలని నిర్ణయించారు. అనంతరం నాటి గురువులు వెంకటేశ్వర్లు, నరేందర్, విజేందర్ రెడ్డి, అప్జద్, కిరణ్‌ను సన్మానించారు.

ఎల్బీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న అధ్యాపకులు

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాలలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. కళాశాలలో 1970 నుంచి 2023వ సంవత్సరం వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గోపిచంద్, కోశాధికారి వైద్యనాథ్, పొల్ట్రీ సైన్స్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎండీ.సిరాజొద్దీన్, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, సూర్యనారాయణ, సత్య పరమేశ్వర్, యాదగిరి, రామరావు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

సర్వమత సమ్మేళనానికి ప్రతీక రంజాన్



కన్సల్టెన్సీ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు ఇస్తున్న వినయ్‌భాస్కర్

కాజీపేట అర్బన్: సర్వమత సమ్మేళనానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తోందని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టెన్సీ సివిల్ ఇంజనీరింగ్ వరంగల్ సెంటర్ చైర్మన్ హిదాయత్‌అలీ తెలిపారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హిదాయత్ అలీ మాట్లాడుతూ నెల రోజుల పాటు ఉపవాస దీక్షలతో రంజాన్ పండుగను జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అంబదాస్, కోశాధికారి మోహన్, లక్ష్మణ్, ప్రభాకర్, భవానీప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు

రంజాన్ పండుగ సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ముస్లింకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సైలానిబాబా, అఫ్జల్, మజీద్, నిసార్, మగ్దుమ్, సిరాజుద్దీన్, నయీముద్దీన్ పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మడికొండ: మాస శివరాత్రి పురస్కరించుకొని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం, నిర్వహించారు. మాస శివరాత్రి కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, దేవేందర్‌శర్మ, సాయిశర్మ, ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బైరి రాజు, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, భక్తులు సురేష్, రాజేందర్, రవి, వెంకన్న, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని గుడిసెవాసులకు కేటాయించాలి



కూల్చిన గుడిసెలను పరిశీలిస్తున్న నాయకులు

వరంగల్: పైడిపల్లి శివారు ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిలో రెండేళ్ల క్రితం 1,560 కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నాయని, ఆ భూమిని వారికే కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కూల్చివేసిన ప్రాంతాన్ని రాష్ట్ర పార్టీ నాయకులు ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, పిల్లలు, మహిళల పట్ల పోలీసు అధికారులు దురుసుగా ప్రవర్తించడం బాధాకరమని వాపోయారు. కూలీనాలి చేసుకుంటూ గుడిసెల్లో ఉంటూ బతుకీడుస్తున్న పేదలపై అధికారులు విరుచుకుపడడం శోచనీయమని వాపోయారు. ప్రభుత్వ నుంచి వారికి నష్టపరిహారం చెల్లించి, ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, సాగర్, సైకిలాబ్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'శ్వేతార్క'లో చండీహోమం



చండీహోమం చేస్తున్న అర్చకులు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఆదివారం శుభకృత్ నామ సంవత్సర చివరి చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయిన వోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో చండీహోమాన్ని పూర్ణాహుతితో ముగించారు. హోమం వలన కలిగే ఫలితాలపై భక్తులకు సాయిచంద్ర శర్మ అనుగ్రహభాషణం చేశారు.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి



మాట్లాడుతున్న సుధీర్‌కుమార్

న్యూశాయంపేట: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని భారత వికాస్ పరిషత్ డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హనుమకొండలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించనున్న మంగల్‌పాండే బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి కే.సత్యనారాయణ, కోశాధికారి బి.వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు గోవిందరాజులు, చంచల్ అగర్వాల్, కన్వీనర్లు బీసీ రామారావు, బీఎన్ రెడ్డి, జయపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామానుజస్వామి, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, మాణిక్యరావు, వివేకానంద ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ శ్రీనివాస్‌కు కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ టికెట్‌ను ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌కు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, భక్తులు



రమేష్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామన్నపేట: వరంగల్‌లోని వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. తూర్పు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్ తేజస్వి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కమిటీ అధ్యక్షుడు రమేష్, సభ్యులు, భక్తులు హాజరై వేణుగోపాల స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తోట నవీన్‌కుమార్, వెంకటకృష్ణ, పబ్బ విశ్వప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ నుంచి సొసైటీకి బదిలీ చేయండి

హసన్‌పర్తి: మడిపల్లిలోని ధాన్యం కొనుగోలు సెంటర్‌ను ఐకేపీ నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి బదిలీ చేయాలని రైతులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో మడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఆ కొనుగోలు కేంద్రంలో అవినీతి చోటు చేసుకుంటోందని వివరించారు. తరుగు పేరిట నిర్వాహకులు మోసం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. 42 కిలోల ధాన్యం తూకానికి బదులు 47 కిలోలు వేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. తరుగు పేరిట బస్తాకు అదనంగా ఐదు కోత విధిస్తున్నారని వాపోయారు. ఫలితంగా తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు వివరించారు. సొసైటీ ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో 42 కిలోలు తూకం వేస్తున్నారని చెప్పారు. గంటూరుపల్లి, నాగారం గ్రామాల్లో ఐకేపీ ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు రావడంతో విజిలెన్స్ విచారణ సాగుతోందని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ రెండు కేంద్రాలు సొసైటీలకు అప్పగించిన విషయాన్ని గుర్తు చేశారు. ఐకేపీ నుంచి సొసైటీకి బదిలీ చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు.

రూ.4,660 మద్యం స్వాధీనం

ఖిలా వరంగల్: అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న ఓ బెల్ట్‌షాపుపై మిల్స్ కాలనీ పోలీసులు దాడి చేసి రూ.4,660ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. వరంగల్ శివనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం ఆ బెల్ట్‌షాపుపై ఆకస్మికంగా పోలీసులు దాడి చేశారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగశాయిపేటకు చెందిన ఆసం సాజన్ ఇటీవల పోగొట్టుకున్నారు. ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో సాజన్‌కు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆదివారం సాయంత్రం సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

ఉగాది పంచాంగం ఆవిష్కరణ



హన్మకొండ కల్చరల్: పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు



కాజీపేట: పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

హన్మకొండ కల్చరల్: నూతన తెలుగు సంవత్సరాది క్రోధినామ సంవత్సర శ్రీలలితా పంచరత్న పంచాంగాన్ని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. హనుమకొండలో సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో వైద్యుడు పాలాస రమేష్, పంచాంగ రత్న కట్టా వెంకట మధుసూదనాచార్యులు ముఖ్యఅతిథులుగా పాల్గొని పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ అర్చక స్వాములు ఇటికెల సనాతనచార్యులు, తుమ్మెనెపల్లి రవీంద్రాచారి, సంఘం నాయకులు గజ్జెల వీరన్న, వీణవంక సదానంద, పెండోట చక్రపాణి, రావుల కొలను రాంమూర్తి, సురేష్, శ్రీనివాస్, సోమేశ్వరాచారి, అలుగోజు కృష్ణమూర్తి, నాగసోమేశ్వరచారి, కట్టా ఈశ్వరప్రసాద్, నాగరాజారావు, డాక్టర్ పొటిశెట్టి విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్ కాలనీలో..

కాజీపేట: క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని చాత్తాద శ్రీవైష్ణవ ఉమ్మడి వరంగల్ జిల్లా సభ్యుల విస్తృత స్థాయి సమావేశంలో వేద పండితులు ఆదివారం ఆవిష్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు, వికాస తరంగిణి బాధ్యుడు దాస్యం రంగనాథ స్వామి ఆధ్వర్యంలో ప్రశాంత్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాంగాన్ని విడుదల చేసి సభ్యులకు అందజేశారు. శ్రీమాన్ సంపన్ముడుంబై వెంకటాచార్య సిద్ధాంతి రచించిన పంచాంగాన్ని వంద మందికి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కృష్ణ, వేణుగోపాల్, గోవిందం, సునీత, మురళి, రూపావతి పాల్గొన్నారు.

మతోన్మాద పార్టీని ఓడించండి



సమావేశంలో వామపక్షాల నాయకులు

న్యూశాయంపేట: మతోన్మాద బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వాసుదేవరెడ్డి అధ్యక్షతన వామపక్షాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలు నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు రోడ్డున పడ్డారని తెలిపారు. సమస్యల నుంచి ప్రజలను పక్కదారి పట్టించేందుకు దేశంలో కుల, మతాల పేరుతో వైషమ్యాలు సృష్టిస్తూ మతోన్మాద చర్యలకు పాలకులు పాల్పడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 11న హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో వామపక్షాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వామపక్షాల నాయకులు బి.చక్రపాణి, కే.భిక్షపతి, శివాజీ, నాగార్జున, బాలరాజ్, రాజు, భాస్కర్, నవీద్, చుక్కయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మిత్రపక్షాలను కట్టడి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూరి

ఖిలా వరంగల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద ఫాసిస్టు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, మిత్ర పార్టీలు తిరిగి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి కోరారు. వరంగల్ పడమరకోటలోని ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో మైదం పాణి అధ్యక్షతన మాస్ లైన్ డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సూరి మాట్లాడుతూ దేశం ప్రశాంతంగా ఉండాలన్నా, కార్పొరేట్ పెట్టుబడిదారుల దోపిడీని అడ్డుకోవాలన్నా, ప్రజలకు కనీస ప్రజాస్వామిక హక్కులు దక్కాలన్నా ఈసారి బీజేపీ అధికారంలోకి రాకుండా ప్రజలు జాగ్రత్త పడాలని సూచించారు. 10 ఏళ్ల పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులకు ప్రధాని మోదీ కట్టబెట్టారని ఆరోపించారు. సమావేశంలో సాబిరీకాని మోహన్, బొర్ల రమేష్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు, సాగర్, లక్క మురళి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వం వచ్చేలా ఆశీర్వదించాలి



వరంగల్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

కాజీపేట: దేశ సుస్థిరతతో పాటు రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మరోమారు నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ కోరారు. కాజీపేట 61వ డివిజన్ ఆర్‌ఈసీ నాన్యతండాలో పలువురు కార్యకర్తలు బీజేపీలో ఆదివారం చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి రమేష్ ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నగర మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ టి.విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, ఎల్.రఘు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

వరంగల్: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. పైడిపల్లి మాజీ సర్పంచ్ కంది రాజేందర్, డైరెక్టర్ లింగం కోటిలింగం, ఆకుల రంజిత్ కుమార్, ఎర్రగొల్ల కుమార్ తదితరులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి హంటర్‌రోడ్డులోని కార్యాలయంలో బీజేపీలో ఆదివారం చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుద్దె శ్రీనివాస్, జలగం రంజిత్, జన్ను ఆరోగ్యం, తిరుపతి, జన్ను రవి, జన్ను కుమార్, చల్వాడి గోపాల్, కంది కృష్ణ, బిజిలి రాజా, ముడుసు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

దేశాయిపేట: వరంగల్ తూర్పులోని 230 బూత్‌ల్లో బీజేపీ అభ్యర్థికి ఆధిక్యం తీసుకువచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడితే గెలుపు సాధ్యమని వరంగల్ తూర్పు నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. దేశాయిపేటరోడ్డులోని బీజేపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ పరిధి తూర్పులోని 12, 13, 18, 19, 21, 27వ డివిజన్ల బూత్ అధ్యక్షులు, బూత్ కార్యకర్తలతో ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీబూత్‌లో 370ఓట్లు బీజేపీ అభ్యర్థికి వస్తే విజయం తథ్యమన్నారు. పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాషాయ జెండా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, వన్నాల శ్రీరాములు, టి.కుమారస్వామి, శ్రీనివాస్ గుప్తా, వన్నాల వెంకటరమణ, సతీష్‌షా, కుసుమ సతీష్, మార్టిన్ లూథర్, డివిజన్ అధ్యక్షులు, బూత్ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.